క్లుప్తంగా

వాటర్ ప్యూరిఫయర్ అందజేత



నడికూడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హనుమకొండ జిల్లా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మాదంశెట్టి సదానందం జ్ఞాపకార్థం రూ.17 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను మాదంశెట్టి సంపత్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వాసవి క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహావిష్కరణ



నడికూడ: మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వాసవి క్లబ్ హనుమకొండ, వాసవి వనతా క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ మెంబర్స్ గంప సాంబమూర్తి, నూతన్ కుమార్, నాగభూషణం, లక్ష్మణ్ కాంత్, మాదంశెట్టి సంపత్, మాజీ సర్పంచ్ చాడ తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వేలేరు : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ విమల అన్నారు. మంగళవారం మండలంలోని పీచర ప్రభుత్వ పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డితో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని, బియ్యం, పప్పులు, కూరగాయలు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు ప్రత్యేక పూజలు


ఆత్మకూరు: మండలకేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో నేడు(బుధవారం) నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి తెలిపారు. అలాగే పార్వతీదేవి సమేత మహాదేవస్వామి పంచకూట శివాలయంలో పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు రవీందర్ శర్మ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు మృతి



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ఓ పత్రిక సీనియర్ జర్నలిస్టు బాల్నే తిలక్‌బాబు (53) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. తిలక్‌బాబు మృతదేహానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, సీనియర్ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి, తహసీల్దార్ సత్యనారాయణ, శాయంపేట సీఐ రంజిత్‌రావు, ఎస్సై పరమేష్,, జర్నలిస్టులు, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



ఎల్కతుర్తి : ఓ మతిస్థిమితం లేని వ్యక్తి సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన ముల్కనూర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం..భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన మామిడాల శ్రావణ్‌కుమార్(44) మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతూ ఎవరూ అన్నం పెట్టినా భుజించి జీవించేవాడు. కాగా శ్రావణ్‌కుమార్ సోమవారం రాత్రి హవల్దార్‌పల్లె నుంచి ముల్కనూర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడి ఉన్న వ్యక్తిని చూసి వాహనదారులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

అధ్వానం..అంతర్గత రోడ్లు

- గుంతలమయంగా రహదారులు
- మరమ్మతుకు నోచుకోని పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఆరెవాడలో సీసీరోడ్డుపై నిలిచిన మురుగునీరు

దామెర : మండలకేంద్రంలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల కిందట నిర్మించిన సీసీ రోడ్లు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం మూలంగా మరమ్మతు చేయకపోవడంలో గుంతల రోడ్లపై అవస్థలు పడుతూ రాకపోకలు కొనసాగిస్తున్నారు.

మిషన్ భగీరథ తవ్వకాలతో ధ్వంసమైన రోడ్లు: గ్రామంలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణంలో భాగంగా సీసీ రోడ్లను తవ్వి రోడ్లకు అడ్డంగా పైప్‌లైన్ నిర్మించి తిరిగి కాంక్రీట్‌తో పూడ్చకుండా వదిలేశారు. దీంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ఇరుకు రోడ్లపై పారుతున్న మురుగునీరు

పేరుకు మండలకేంద్రమైనా అభివృద్ధిలో మాత్రం ఆమడదూరంలో ఉంది. అంతర్గత రహదారులు ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాలు వచ్చిన సమయంలో రెండో వాహనం వెళ్లే పరిస్థితి లేదు. అంతేకాకుండా సైడ్ డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో గృహాల నుంచి విడుదలయ్యే మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పాత గ్రామపంచాయతీకి వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన



మిషన్ భగీరథ తవ్వకాలతో ధ్వంసమైన రోడ్డు

డ్రెయినేజీ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అంతే కాకుండా రాత్రి వేళలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి మరమ్మతులు చేయాలని, నూతన రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



గతంలో నిర్మించిన సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో గుంతలు ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షంనీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో ముక్కుమూసుకొని నడవాల్సి వస్తుంది. అధికారులు దృష్టిసారించాలి.

– హింగె రవీందర్, దామెర

భక్తిశ్రద్ధలతో పంబారట్టు



దామెర : అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న మాలధారులు



పరకాల : మహాన్నదానంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

దామెర : మండలకేంద్రంలో పంబారట్టు కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివాలయం ప్రధాన అర్చకులు నాగిళ్ల రాజుశర్మ, నీరుకుళ్ల ఆలయ అర్చకులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా స్థానిక గిద్దెచెరువులోకి స్వామివారిని తీసుకెళ్లి, సంప్రదాయరీతిన పూజలు నిర్వహించారు. అనంతరం మహాపడి పూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, గురుస్వాములు ఆలేటి సునీల్, దామెప్పుల శంకర్, అల్లం రవికుమార్, రజినీకర్, నాగరాజు, రఘువీర్ పెద్ద ఎత్తున అయ్యప్పస్వామి భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో మహాన్నదానం

పరకాల : పట్టణంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో కూరగాయల వ్యాపారి వనం రాజేందర్ ఆధ్వర్యంలో మహాన్నదానం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు కానుగుల గోపినాథ్, సంఘ పురుషోత్తం, చట్ల రజినీకాంత్, వీర్ల విజయ్, కక్కు రాజు, కుక్కల శ్రీధర్, ఆకుల కుమారస్వామి 150 మంది మాలధారులు పాల్గొన్నారు.

ఏపీఓల జిల్లా అధ్యక్షుడిగా కుమారస్వామి



హన్మకొండ అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమ అధికారులు (ఏపీఓ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా భీమదేవరపల్లి ఏపీఓగా పనిచేస్తున్న పెరుమాండ్ల కుమారస్వామి ఎన్నికయ్యారు. డీఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లాలోని ఏపీఓల సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నలుమాసుల రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నక్క కుమారస్వామి, ఉపాధ్యక్షురాలుగా కీర్తి అనిత, కోశాధికారిగా మార్క సంపత్, సహాయ కార్యదర్శిగా కలకట్ల విజయలక్ష్మి, ఈసీ సభ్యులుగా మార్త ఇందిర, కె.విజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డీఆర్డీఏ పీడీ మేన శ్రీనును జిల్లా నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న ప్రభుత్వం

- కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాలపురి కనకరత్నం



సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, ఏడాది కాలంలోనే అనేక హామీలు అమలు చేసిందని రైతులు అధైర్యపడొద్దని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాలపురి కనకరత్నం, సీనియర్ నాయకుడు తిప్పారపు యుగేందర్ తెలిపారు. మండలంలోని పంగిడిపల్లిలో మంగళవారం రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొన్ని సాంకేతిక కారణాల వలన రూ.2 లక్షలకు పైన ఉన్న రైతుల రుణాలు మాఫీ కాలేదని, అవి కూడా మాఫీ చేస్తుందన్నారు. ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. అనంతరం పంగిడిపల్లిలో సుమారు 80 శాతానికి పైగా రైతులకు రుణమాఫీ అయిందని, రుణమాఫీ పొందిన రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు సాంబయ్య, రాజు, లింగమూర్తి, ఆదిరెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు

- రాష్ట్ర కార్యదర్శిగా సోమశేఖర్



కె.సోమశేఖర్



డి. కిరణ్‌కుమార్

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ మహాసభల్లో నూతన కమిటీలో హనుమకొండ జిల్లా నుంచి ఇద్దరి ఉపాధ్యాయులకు చోటు లభించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు నల్లగొండ జిల్లా కేంద్రంలో ముగిశాయి. నూతన కమిటీని ఎన్నుకున్నారని, ఇద్దరికి చోటు లభించినట్లు మంగళవారం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు కె.సోమశేఖర్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులుగా ఇదే జిల్లాకు చెందిన డి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. సోమశేఖర్ ధర్మసాగర్ మండలం మల్లక్‌పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్‌గా, డి.కిరణ్‌కుమార్ హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. వీరి ఎన్నికపై హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సేవలు కీలకం

- వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



సాయిచరణ్‌ను సన్మానిస్తున్న డీసీపీ రవీందర్, తదితరులు

గీసుకొండ : ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగుల సేవలు కీలకమని వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. గీసుకొండ ఎంపీడీఓగా పని చేసి హసన్‌పర్తి ఈటీసీ ఫ్యాకల్టీగా పని చేసిన వీరమల్ల సాయిచరణ్‌ను ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డీసీపీ మాట్లాడారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలు అందించే అవకాశం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్య పరిరక్షణకు, కుటుంబ సభ్యులతో గడపడానికి, సామాజిక సేవలకు సమయం కేటాయించాలని ఆకాంక్షించారు. అనంతరం సాయిచరణ్ మాట్లాడారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు విధి నిర్వహణలో ఎనలేని సహకారం అందించారని చెప్పారు. కార్యక్రమంలో జగిత్యాల డీఎస్పీ రవీంద్ర కుమార్, డీఆర్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కుమార్, డీఆర్‌డీఓ మేన శ్రీను, టీజీఓల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, నాయకుడు రాజేశ్‌గౌడ్, ఈటీసీ ప్రిన్సిపాల్ విజయ్‌నాయక్, డీఆర్‌డీఓలు కౌసల్యాదేవి, సంపత్‌రావు, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రాడీషీటర్లకు కౌన్సెలింగ్

సంగెం : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు పర్వతగిరి సీఐ రాజగోపాల్ మంగళవారం కౌన్సెలింగ్ చేశారు. సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. సివిల్, ఇతర తగాదాల్లో జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు, పంచాయతీలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్సై ఎల్. నరేష్ పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజగోపాల్

రక్షణ రంగంలో విస్తృత ఉద్యోగావకాశాలు

- ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రామదురై



కార్యక్రమంలో మాట్లాడుతున్న కల్నల్ రామదురై

విద్యారణ్యపురి: రక్షణ రంగంలో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని 10వ కంపెనీ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్ఎస్ రామదురై అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని గణితశాస్త్ర విభాగ సెమినార్‌హాల్‌లో విభాగం అధిపతి డాక్టర్ భారవీశర్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో మిలటరీలోని ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఎన్‌డీఏ, సీడీఎస్ పరీక్షల విధానంపై అవగాహన కల్పించారు. మేజర్ సుబేదార్ రఫీతో కలిసి విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు. కార్యక్రమంలో గణిత విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్, డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ బీఎల్.సౌజన్య, డాక్టర్ సోమయ్య, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ సుమతి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



నడికూడ : చర్లపల్లిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్ జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 5న గీసుకొండ మండలంలోని మొగిలిచెర్ల, గొర్రెకుంట, విశ్వనాథపురం గ్రామాల్లో సబ్‌స్టేషన్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు అధిసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తల ప్రోత్సాహంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతున్నానన్నారు. కార్యక్రమంలో నాయకులు కమలాపురం రమేష్, బీరం సుధాకర్‌రెడ్డి, పరికిరాల వాసు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలపై దృష్టి సారించాలి

నడికూడ: ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నార్లపూర్‌లో నార్లపూర్ వాగు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వచ్చే వరద నీటితో గ్రామంలో ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. అనంతరం మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శ్రీనివాస్, గ్రామస్తులు, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు



కేజీబీవీ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కమలాపూర్: సమగ్ర శిక్ష ఉద్యోగులకిచ్చిన హామీలు నెరవేర్చి తక్షణమే ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఎదుట విద్యార్థినులతో కలిసి మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 రోజులుగా ఉద్యోగులు సమ్మె బాట పట్టి పాఠశాలకు రావడం లేదన్నారు. దీంతో పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో పాఠాలు చెప్పడానికి ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ సమస్యలు ఏకరువు పెడుతూ పాటపాడి ఉపాధ్యాయులు వెంటనే విధుల్లోకి వచ్చేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు శివ, సాయి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పార్టీలో ఏళ్లుగా పనిచేసినా ఫలితం శూన్యం

- కాంగ్రెస్ మధ్యప్రదేశ్ ఓబీసీ ఇన్‌చార్జ్ ఉల్లెంగుల యాదగిరి

ఐనవోలు : కాంగ్రెస్ బడాబాబులే సంపాదించుకున్నారని, సామాన్య కార్యకర్తకు ఎలాంటి ప్రయోజనం జరగడం లేదని గత 34 ఏళ్లుగా కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఓబీసీ ఇన్‌చార్జ్, మండలంలోని నందనం గ్రామానికి చెందిన ఉల్లెంగుల యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 1994–2004 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు లీడర్లు, కార్యకర్తలు సంపాదించుకోగా 2004–2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉండగా కేవలం కాంగ్రెస్ బడాబాబులు మాత్రమే సంపాదించుకున్నారని ఆవేదన వెల్లగక్కారు. 2014–2023 వరకు తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా లీడర్లు, కార్యకర్తలకు మేలు జరిగిందన్నారు. కానీ 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు కాంగ్రెస్ క్యాడర్‌ను ఏ మాత్రం పట్టించుకోకుండా టీడీపీ, బీఆర్ఎస్ లీడర్లకు మాత్రమే లబ్ధి చేకూరుస్తుందని, వారిదే హవా నడుస్తోందని ఆరోపించారు. ఇదే పరిస్థితి రాష్ట్రంలో కొనసాగితే కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పార్టీ మనుగడ ప్రమాదంలోకి నెట్టివేయ బడుతుందని వాపోయారు. కీలకమైన ఇలాంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

రూ. 750 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ధర్మసాగర్ : ఈ ఏడాది కాలంలో స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం సహకారంతో మొత్తం రూ.750 కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు తీసుకువచ్చానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నియోజక వర్గ ప్రజలందరి సహకారంతో ఎమ్మెల్యేగా ఎన్నికై సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ప్రధాన అంశాలను పరిష్కరించుకోగలిగామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, 100 పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ డివిజినల్ ఆఫీస్ కాంప్లెక్స్ , స్టేషన్ ఘనపూర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీ గా చేసుకోవడంతో పాటు సాగునీటి కోసం ఘనపూర్ రిజర్వాయర్ నుండి నవాబ్ పేట రిజర్వాయర్ మెయిన్ కెనాల్ సిసి లైనింగ్ ఏర్పాటుకు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించుకోబోతున్నామని అన్నారు. రాజకీయాలకతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో నా వెన్నంటే ఉంటూ సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి ఆశలు, ఆకాంక్ష నెరవేరాలని అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

కొలతలు సరిచూసుకోవాలి

సంగెం : గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ సర్వే జరుగుతున్న క్రమంలో రైతులు కొలతలను ప్రత్యక్షంగా ఉండి సరిచూసుకోవాలని తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో అలైన్‌మెంట్ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు సకాలంలో పరిహారం అందేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. అలైన్‌మెంట్ పూర్తి అయిన భూములకు సంబంధించిన రైతులు బ్యాంకు ఖాతాతోపాటు పట్టాదారు పాస్ బుక్కు, ఆధార్ కార్డు, తదితరాలు సమర్పిస్తే త్వరలో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, హైవే అథారిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.